ఆక్రమణలో ఆస్పత్రి..!

- చుట్టూ దుకాణాలతో దారిలేని వైనం
- ప్రాంగణమంతా దుర్వాసన
- మరుగుదొడ్లు లేక ఉద్యోగులకు తీవ్ర అసౌకర్యం
- తాగునీటికీ తప్పని ఇబ్బందులు
- ఇదీ గోపాలపట్నం ప్రాంతీయ పశువైద్యశాల పరిస్థితి



గోపాలపట్నం ప్రభుత్వ ప్రాంతీయ పశువైద్యశాల పరిసరాల్లో దుకాణాలు



ఆస్పత్రికి వెళ్లే దారిలో ఇలా...

విశాఖ విద్య: జీవీఎంసీ 90వ వార్డు బాజీ జంక్షన్‌లో ఉన్న గోపాలపట్నం ప్రభుత్వ ప్రాంతీయ పశువైద్యశాలను పరిసరాల్లోని నాలుగు వార్డుల్లో గల పశుపక్ష్యాదులకు వైద్యసేవలు అందించేందుకని ఏర్పాటు చేశారు. 89, 90, 91, 92వ వార్డులతో పాటు, ఫ్లై ఓవర్‌కు అవతల వైపు ఉన్న 52, 57వ వార్డుల నుంచి కూడా వైద్యం కోసమని పెంపుడు జంతువులను ఎక్కువగా ఇక్కడికి తీసుకొస్తారు. అసిస్టెంట్ డైరెక్టర్ హోదా గల డాక్టర్ రవికుమార్ ఇక్కడి నుంచే పెందుర్తి, పెదగంట్యాడ, గాజువాక పశువైద్యశాలలను పర్యవేక్షిస్తారు. ఇంతటి ప్రాధాన్యత కలిగిన గోపాలపట్నం ప్రాంతీయ పశువైద్యశాల ప్రస్తుతం సమస్యలతో కునారిల్లుతోంది.

దాతల సహకారంతోనే సౌకర్యాలు

గోపాలపట్నం ప్రభుత్వ ప్రాంతీయ పశువైద్యశాలకు వైద్యం కోసమని రోజూ 35 నుంచి 50 వరకు కేసులు వస్తుంటాయి. నగర ప్రాంతం కావడంతో ఎక్కువగా పెంపుడు జంతువులను ఇక్కడికి తీసుకొస్తుంటారు. పశువైద్యంలో సీనియర్‌గా గుర్తింపు ఉన్న డాక్టర్ రవికుమార్ అందించే సేవలతో గతంలో కన్నా, వైద్యం కోసమని తీసుకొచ్చే పెంపుడు జంతువుల సంఖ్య పెరిగింది. మరోవైపు ఇక్కడ మౌలిక సౌకర్యలు పెంపొందించేలా డాక్టర్ రవికుమార్ తనకున్న పరిచయాలతో రేకుల షెడ్డు వేయించారు. అదేవిధంగా పెంపుడు జంతువులకు మెరుగైన వైద్యం అందించేలా ఆపరేషన్ థియేటర్ అందుబాటులోకి తీసుకొచ్చారు. కొంతమంది దాతల సహకారంతో త్వరలోనే క్రిటికల్ కేర్ యూనిట్‌ను కూడా ఏర్పాటు చేసేందుకు ఏర్పాట్లు చేశారు.

సమస్యలు పట్టించుకోని పాలకులు

ప్రభుత్వ పశువైద్యశాలలో పేరుకుపోయిన సమస్యలను పరిష్కరించేందుకు స్థానిక ఎమ్మెల్యే గణబాబు దృష్టి సారించడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. స్థానిక కార్పొరేటర్ సైతం దీనిపై పట్టించుకోకపోవడంతో పశుపక్ష్యాదులకు వైద్యం దూరమయ్యే పరిస్థితులు ఎదురౌతున్నాయని ఈ ప్రాంత వాసులు అంటున్నారు. ఆస్పత్రి ప్రాంగణం ఆక్రమణకు గురికాకుండా చుట్టూ కాంపౌండ్ వాల్ నిర్మాణం చేపట్టాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని అంటున్నారు. గత కలెక్టర్ డాక్టర్ మల్లికార్జున సమయంలో సీఎస్ఆర్ నిధులు రూ.8.7 లక్షలతో కాంపౌండ్ వాల్ నిర్మాణానికి ప్రతిపాదనలు చేసినా, ఆ తర్వాత ఎవరూ పట్టించుకోలేదు. పెంపడు జంతువుల వైద్యానికి పెద్ద దిక్కుగా ఉన్న గోపాలపట్నం పశు వైద్యశాల సమస్యల పరిష్కారానికి ఉన్నతాధికారులు దృష్టి సారించాని ఈ ప్రాంత వాసులు కోరుతున్నారు.

ఆస్పత్రిని ఆక్రమించేస్తున్నారు

గోపాలపట్నం పశువుల ఆస్పత్రి చుట్టూ దుకాణాలు నిర్వహిస్తుండటంతో లోపలకి వెళ్లేందుకు దారి కూడా ఉండటం లేదు. బీఆర్‌టీఎస్ రోడ్డు వైపున ఆస్పత్రికి ఆనుకుని కూరగాయలు, పువ్వులు, ఇతర దుకాణాలు నిర్వహిస్తూ, వాటి కోసమని తార్పాణాలతో కప్పేస్తున్నారు. దీంతో రోడ్డుపై నుంచి వెళ్లే వారికి ప్రభుత్వాస్పత్రి కనిపించడం లేదు. దుకాణదారులకు కూటమి నాయకులు వత్తాసు పలుకుతుండడంతో ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది వారినేమీ అనలేకపోతున్నారు. దీంతో ప్రభుత్వాస్పత్రి చుట్టూ వ్యాపారులు ఆక్రమించేస్తున్నారు.

తాగేందుకు నీళ్లు లేని దుస్థితి

ఆస్పత్రి ప్రాంగణంలో చేతి పంపు మాత్రమే ఉంది. ఆ నీళ్లు తాగే పరిస్థితి లేదు. చేతిపంపు చుట్టూ నీరు నిల్వ నిలిచిపోతోంది. సంతలోని చెత్త, వ్యర్థాలను చేతిపంపునకు సమీపంలోనే వేస్తుండడంతో ఆస్పత్రి ప్రాంగణమంతా దుర్వాసన వస్తోంది. ఆస్పత్రిలో పనిచేస్తున్న వైద్యులు, సిబ్బందితోపాటు, ఆస్పత్రికి వచ్చే వారికి కూడా తాగేందుకు ఇక్కడ గుక్కెడు నీళ్లు దొరకని పరిస్థితి నెలకొంది. అంతేకాకుండా ఆస్పత్రిలో మరుగుదొడ్లు సదుపాయం కూడా లేదు. దీంతో ఇక్కడ పనిచేస్తున్న మహిళా ఉద్యోగులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు.



చేతిపంపు వద్ద నిలిచిపోయిన నీరు

ఆటంకం లేకుండా వైద్యసేవలు



ఆస్పత్రి చుట్టూ దుకాణాలతో ఇబ్బంది కలుగుతోంది. కానీ దీనిపై తామేమీ చేయలేకపోతున్నాం. చుట్టూ కాంపౌండ్ వాల్ నిర్మిస్తే కొంతమేర రక్షణ ఉంటుంది. తాగునీరు, ఇతర సమస్యలపై ఉన్నతాధికారులకు నివేదించాం. సమస్యలున్నప్పటికీ ఆస్పత్రికి తీసుకొచ్చే పశువులు, పెంపుడు జంతువుల వైద్యానికి ఆటంకం లేకుండా తగిన శ్రద్ధ తీసుకుంటున్నాం.

– డాక్టర్ రవికుమార్, వైద్యాధికారి

క్లుప్తంగా

వాటర్ స్కీమ్ ప్రారంభం

మల్కాపురం: జీవీఎంసీ 61వ వార్డు జనతా కాలనీ వద్ద స్థానికుల నీటి అవసరాల నిమిత్తం పైలెట్ వాటర్ స్కీమ్ ఏర్పాటు చేశారు. ఈ ప్రాజెక్టును స్థానిక నాయకుడు మజ్జి సోమేష్ ఆదివారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మహిళల నీటి అవసరాలను దృష్టిలో పెట్టుకుని ఇక్కడ ప్రాజెక్టు ఏర్పాటు చేశామని, సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

సత్యసాయి సేవా సంస్థల రక్తదాన శిబిరం



రక్తదానం చేస్తున్న సత్యసాయి భక్తులు

ఎంవీపీకాలనీ: భగవాన్ సత్యసాయిబాబా 99వ జయంతి వేడుకలను పురస్కరించుకొని ఆదివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. శ్రీ సత్యసాయి సేవా సంస్థలు, శ్రీ సత్యసాయి సేవా సమితి, శ్రీసత్యసాయి నగర సేవా సంస్థల ఆధ్వర్యంలో ఎంవీపీ కాలనీ ప్రేమ సదన్‌లో ఈ కార్యక్రమం జరిగింది. భారీ ఎత్తున నగర వాసులు, భక్తులు, విద్యార్థులు పాల్గొన్నారు. సత్యసాయి చిత్రపటానికి పూలమాలలు వేసి వేడుకలు ప్రారంభించారు. 34 మంది భక్తులు రక్తదానం చేశారు. కార్యక్రమంలో శ్రీసత్యసాయి సేవా సమితి జిల్లా అధ్యక్షుడు పి.ఆర్.ఎస్.నాయుడు, రోటరీ క్లబ్ చైర్మన్ కె.వి.శ్రీనివాస్, మాజీ చైర్మన్ జి.ఎస్.రాజు, సత్యసాయి సేవా సమితి కన్వీనర్ ప్రభాకర్, రామినాయుడు, శివాజీ, రామకృష్ణరావు, జ్యోతి, నాగవేణి, గౌతమ్ తదితరులు పాల్గొన్నారు.

జీతాలు చెల్లించాలని కాంట్రాక్ట్ కార్మికుల ధర్నా

గాజువాక: తమకు ఉద్యోగ భద్రత కల్పించడంతో పాటు సకాలంలో జీతాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ విశాఖ స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్టు కార్మికులు ఆదివారం ధర్నా నిర్వహించారు. ఉక్కు అఖిలపక్ష కాంట్రాక్టు కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో నాయకులు కేంద్ర ప్రభుత్వ విధానాలపై, స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం తీరుపై ధ్వజమెత్తారు. కాంట్రాక్టు కార్మికులను విధుల నుంచి తొలగించవద్దని, పనులు కోల్పోయిన కాంట్రాక్టు కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఫిట్‌నెస్ పేరుతో చేపడుతున్న వైద్య పరీక్షలను వెంటనే నిలిపివేయాలని, ఉక్కు నిర్వాసితులకు శాశ్వత ఉపాధి కల్పించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు డి.ఆదినారాయణ, నీరుకొండ రామచంద్రరావు, ఎస్.రామారావు, యు.రామస్వామి, జి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

కారు ఢీకొని వృద్ధుడి మృతి

ఆరిలోవ: ఆరిలోవలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వృద్ధుడు మృతి చెందాడు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలిలా.. ఆరిలోవ టీఐసీ పాయింట్ హిందీ భవన్ ఎదురుగా రోడ్డు పక్కన పార్వతమ్మ తోపుడు బండిపై పండ్లు విక్రయిస్తుంటుంది. అదే ప్రాంతానికి చెందిన బెల్లాన కోటేశ్వరరావు(66), అతడి భార్య ఆదివారం సాయంత్రం వాకింగ్‌కు వెళ్లొచ్చి పళ్లు కొనేందుకు బండి వద్ద నిల్చున్నారు. అదే సమయంలో దుర్గాబజార్ వైపు నుంచి ఓ కారు అతివేగంతో వస్తూ పండ్ల బండిని బలంగా ఢీకొట్టింది. బండితోపాటు పండ్ల వ్యాపారి పార్వతమ్మ, కోటేశ్వరరావు, అతని భార్యను కూడా ఢీకొనడంతో వారంతా రోడ్డుపై పడి తీవ్ర గాయాలపాలయ్యారు. స్థానికులు అంబులెన్స్‌కు ఫోన్ చేయడంతో వెంటనే వైద్య సిబ్బంది చేరుకొని ముగ్గురినీ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే కోటేశ్వరరావు మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడి భార్య, పండ్ల వ్యాపారి పార్వతమ్మ తీవ్ర గాయాలతో చికిత్స పొందుతున్నారు. స్థానికుల ద్వారా విషయం తెలుసుకున్న ఆరిలోవ పోలీసులు ఈ ఘటనపై కేసు నమోదు చేశారు. కోటేశ్వరరావు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. కారును స్టేషన్‌కు తరలించి డ్రైవ్‌చేసిన వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. మృతుడు కోటేశ్వరరావు జీవీఎంసీ రిటైర్డ్ డీఈ. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలున్నారు.

హరిత విశాఖకు సహకరించండి

మేయర్ గొలగాని హరి వెంకట కుమారి



మొక్కలు పంపిణీ చేస్తున్న మేయర్ హరి వెంకటకుమారి

విశాఖ విద్య: విశాఖ నగరాన్ని పచ్చదనంగా తీర్చిదిద్దేందుకు స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి, డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ పిలుపునిచ్చారు. జీవీఎంసీ 52వ వార్డు మర్రిపాలెం కాలనీ వాసులకు మొక్కలు పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ విశాఖ నగరాన్ని గ్రీన్ సిటీగా అభివృద్ధి పరిచేందుకు కృషి చేస్తామన్నారు. ఇందుకు నగర ప్రజలు ఎన్జీవోస్, వాకర్ అసోసియేషన్, నివాస సంక్షేమ సంఘం సభ్యులు, ప్రభుత్వ ప్రైవేటు సంస్థలు సహకరించాలన్నారు. హరిత విశాఖగా తీర్చిదిద్దేందుకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

నూతన కార్యవర్గం ఎన్నిక



ఏపీఆర్ఎస్ఏ విశాఖ సిటీ నూతన కార్యవర్గంతో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు త్రినాథ్, రమేష్

మహారాణిపేట: ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ (ఏపీఆర్ఎస్ఏ) విశాఖ సిటీ నూతన కార్యవర్గం ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నికైంది. 12 పోస్టులకు ఒక్కో నామినేషన్ రావడంతో ఎన్నిక ఏకగ్రీవంగా జరిగినట్టు జిల్లా ఉపాధ్యక్షుడు, ఎన్నికల అధికారి పి.శ్యామ్‌ప్రసాద్, జిల్లా బ్రాంచ్ స్పోర్ట్స్ అండ్ కల్చరల్ కార్యదర్శి, అసిస్టెంట్ ఎన్నికల అధికారి కె.అనిల్‌కుమార్ యాదవ్ తెలిపారు. విశాఖ సిటీ అధ్యక్షుడిగా బీవీఎస్ఎస్ నియోగి (స్పెషల్ డిప్యూటీ తహసీల్దార్, యూఎల్‌సీ), కార్యదర్శి బి.రవిశంకర్ (డిప్యూటీ తహసీల్దార్), అసోసియేట్ అధ్యక్షులుగా పీయూఎస్ ఉమామహేశ్వరరావు, ఉపాధ్యక్షుడిగా వీవీఎస్‌వీ వరుణ్, బి.సతీష్, ఎం.భవానీ, సంయుక్త కార్యదర్శులుగా జె.ఎస్.వి.వి.ఎన్.మూర్తి, పీవీ రవి వర్మ, కె.లక్ష్మణరావు, కోశాధికారిగా వీఎస్ఆర్ కృష్ణ ముళ్లపూడి, కార్యవర్గ సభ్యులుగా డి.రామకృష్ణ, ఆర్.వరలక్ష్మి ఎన్నికయ్యారు. కార్యవర్గాన్ని ఏపీఆర్ఎస్ఏ జిల్లా అధ్యక్షుడు త్రినాథరావు, కార్యదర్శి సీహెచ్‌వీ వర్మ, రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి డి.రాజేంద్రవర్మ, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ కె.వేణుగోపాల్, కోశాధికారి జి.రాజేష్ అభినందించారు. ఏపీఆర్ఎస్ఏ విశాఖ డివిజనల్ బ్రాంచి కార్యవర్గ ఎన్నిక కూడా ఏకగ్రీవమైంది. అధ్యక్షుడిగా పి.నవీన్ రాజా (డీటీ, ములగాడ), కార్యదర్శిగా ఎస్‌వీకే చైతన్య (ఆర్ఐ, మహారాణిపేట), అసోసియేట్ అధ్యక్షుడిగా ఎం.మహేశ్వరరావు, ఉపాధ్యక్షులుగా బి.మధుకుమార్, వి.సురేష్ యాదవ్, జి.రమ, సంయుక్త కార్యదర్శులుగా ఎస్.మృదుల, జేవీఎస్ చంద్రశేఖర్, జె.శివశంకర్, కోశాధికారిగా కె.నగేష్, కార్యవర్గ సభ్యులుగా హుస్సేన్ బేగ్, కె.కోమలి ఎన్నికయ్యారని ఎన్నికల అధికారి పీఆర్ఎస్ఏ ఆర్గనైజింగ్ సెక్రటరీ కె.వేణుగోపాల్ తెలిపారు.

రక్షణ రంగ ఉద్యోగుల సేవలు స్ఫూర్తిదాయకం

వైజాగ్ సీ పోర్ట్ ఎండీ రాగం కిషోర్



ప్రోత్సాహకాలు అందుకున్న విద్యార్థులతో నిర్వాహకులు

విశాఖ విద్య: దేశ రక్షణతోపాటు సామాజిక సేవలోనూ పలువురు రక్షణ రంగ ఉద్యోగులు ముందు వరుసలో ఉన్నారని, వారి సేవలు అత్యంత ప్రశంసనీయమని వైజాగ్ సీ పోర్ట్ ఎండీ, పినాకిల్ హాస్పిటల్స్ చైర్మన్ రాగం కిషోర్ కొనియాడారు. జీవీఎంసీ 90వ వార్డు ఎన్ఏడీ సమీపంలోని కాకానినగర్‌లో గల ఈస్టర్న్ నావెల్ కమాండ్ కేటీబీ అసోసియేషన్ ఆధ్వర్యంలో విద్యారంగంలో ప్రతిభ చూపిన విద్యార్థులకు ఆదివారం ప్రోత్సాహకాలు అందించారు. అసోసియేషన్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో కిషోర్ మాట్లాడుతూ రక్షణ రంగంలో సేవలు అందిస్తూనే సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టడం ఎంతోమందికి స్ఫూర్తిదాయకమన్నారు. విద్యతోనే అపారమైన ఉపాధి అవకాశాలని, అందువల్ల విద్యా రంగంలో రాణించేందుకు కృషి చేయాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. గౌరవ అతిథి ఎన్ఆర్ఐ ఆస్పత్రి డీన్, ఆంధ్ర మెడికల్ కళాశాల పూర్వ ప్రిన్సిపాల్ డాక్టర్ పీవీ సుధాకర్ మాట్లాడుతూ విద్యార్థులను ప్రోత్సహించడం ఎంతో మంచి శుభ పరిణామమన్నారు. సంస్థ గౌరవ అధ్యక్షుడు గంట్ల శ్రీనుబాబు మాట్లాడుతూ సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యుల కోసం ఇప్పటికే ఉచిత రక్తదాన శిబిరాలు, వైద్య శిబిరాలతోపాటు ఉచిత యోగా తరగతులు, సైకాలజిస్ట్ సేవలు కూడా సంఘం భవనంలో అందుబాటులో ఉంచామన్నారు. అనంతరం అతిథులను సంస్థ కార్యవర్గ సభ్యులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్షులు బత్తుల చిరంజీవి, కార్యదర్శి విజనగిరి భాస్కరరావు, జబర్దస్త్ నటులు అప్పారావు, డాక్టర్ రాజేష్, ఆశా ఇంజినీరింగ్ అధినేత బత్తిన శ్రీనివాస్, బీఎస్ ప్రకాష్ రావు, రాజ్‌కుమార్, జి.శ్రీనివాస్, బీఎస్ నాయుడు, ఎస్.రమణ, అప్పలరాజు, విజయ్, రెడ్డిపల్లి యోగిత, వి.వెంకటేష్ పి.రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

శివయ్యకు ఘనంగా రుద్రాభిషేకం



ప్రత్యేక వేదికపై కొలువు దీరిన శివపార్వతులు



శివ లింగానికి అభిషేకం

విశాఖ విద్య: కార్తీక మాసంలో రెండో రోజైన ఆదివారం శివాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పశ్చిమ నియోజకవర్గంలోని అన్ని శివాలయాలతోపాటు, ఇతర ఆలయాల్లో కార్తీక మాసోత్సవ పూజల కోసమని ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఇందులో భాగంగా జీవీఎంసీ 52వ వార్డు మర్రిపాలెం వుడా లే అవుట్ కాలనీలోని శ్రీ వరసిద్ధి వినాయక ఆలయంలో రుద్రాధ్యాయం, శ్రీ సూక్త పురుష సూక్త సహిత శివ సంకల్ప పారాయణ జపించారు. అనంతరం మహాన్యాస పూర్వక ఏకవార రుద్రాభిషేకం వైభవోపేతంగా నిర్వహించారు. ఆదివారం నాటి పూజల్లో డాక్టర్ శ్రీనివాసరావు, డాక్టర్ శిరీష దంపతులు పాల్గొన్నారు. పురోహితులు సాయి తేజ, ఆలయ అర్చకులు శ్రీ శర్మ భక్తుల గోత్రనామాలతో పూజలు చేసి, తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు డి.సూర్యనారాయణ, ఐవీ శంకరరావు, జాయింట్ సెక్రటరీ డాక్టర్ కె.శిరీష ఏర్పాట్లు పర్యవేక్షించారు.

శివాలయాల్లో నేడు ప్రత్యేక పూజలు

కార్తీక మాసం తొలి సోమవారం నియోజకవర్గంలోని అన్ని శివాలయాల్లో వేడుకగా పూజలు నిర్వహణకు ఆలయ కమిటీల ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. కార్తీక మాసంలోని సోమవారం శివపార్వతులను దర్శించుకునేందుకు అధిక సంఖ్యలో భక్తులు తరలిరానున్నారు. ఆలయాల్లో కార్తీక దీపారాధనకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

మోదీ విధానాలకు వ్యతిరేకంగా పోరాడాలి

సీపీఎం నేత సీహెచ్ నర్సింగరావు



మహాసభలో ప్రసంగిస్తున్న నర్సింగరావు


గాజువాక: మోదీ ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ప్రజా పోరాటాలు నిర్వహించాలని సీపీఎం నేత సీహెచ్ నర్సింగరావు పిలుపునిచ్చారు. గాజువాకలో ఆదివారం నిర్వహించిన ఆ పార్టీ గాజువాక జోన్ 9వ మహాసభలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ విధానాల కారణంగా జరుగుతున్న నష్టాలను ప్రజలవద్దకు తీసుకెళ్లాలన్నారు. మతోన్మాదాన్ని ఓడించాలని, ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవాలని అన్నారు. విశాఖస్టీల్‌ప్లాంట్ ఏర్పాటు కావడం వల్లే గాజువాక అన్ని రంగాల్లోనూ అభివృద్ధి సాధించిందన్నారు. ఈ ప్రాంతం ఒకప్పుడు అభివృద్ధికి దూరంగా ఉండేదని, పారిశ్రామికీకరణ తర్వాత ఇక్కడ పెద్దపెద్ద షాపింగ్ మాళ్లు వచ్చాయన్నారు. ఎన్నో పోరాటాలు, ప్రాణ త్యాగాలతో సాధించుకున్న విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను మోదీ ప్రభుత్వం ప్రైవేటీకరించేందుకు పూనుకుందన్నారు. ప్రభుత్వరంగం బలోపేతం అయితే ఈ ప్రాంతం అభివృద్ధి చెందుతుందన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ ఈ ప్రాంత ప్రజలకు ఆధారమన్నారు. ఈ పరిశ్రమ ప్రభుత్వరంగంలోనే ఉంటేనే స్టీల్ ధరలు కూడా తక్కువకు లభిస్తాయని, లేనిపక్షంలో దారుణంగా పెరిగిపోతాయని అన్నారు. నిత్యావసరాల ధరలు విపరీతంగా పెరిగిపోయాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ చార్జీలను పెంచేసిందన్నారు. స్టీల్‌ప్లాంట్ పరిరక్షణతోపాటు ధరల నియంత్రణ కోసం పార్టీ నాయకులు, కార్యకర్తలు రాజీలేని పోరాటాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి ఎం.జగ్గనాయుడు తదితరులు పాల్గొన్నారు.

గాజువాక జోన్ కార్యదర్శిగా రాంబాబు

సీపీఎం గాజువాక జోన్ కార్యదర్శిగా ఆ పార్టీ నాయకుడు ఎం.రాంబాబు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆయన మూడేళ్లపాటు ఆ బాధ్యతలో కొనసాగుతారు. కాగా కమిటీ సభ్యులుగా మరో 13 మందిని మహాసభ ఏకగ్రీవంగా ఎన్నుకుంది. కార్యక్రమంలో నాయకులు ఎం.శ్రీనివాసరావు, ఎ.లోకేశ్వరరావు, ఆర్.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

చవితికి ముస్తాబు

- సాయిమందిరంలో నాగుల చవితి వేడుకలు
- పూజల కోసం పార్కుల్లో ప్రత్యేక ఏర్పాట్లు



సహజ సిద్ధమైన పుట్ట



పార్కులో నాగదేవత గుడి



నాగుల చవితి పార్కు



వేప, రావి చెట్టు కలసి పెరిగిన చోటు

విశాఖ విద్య: నాగుల చవితి రోజున నాగదేవతకు పూజలు చేసి పుట్టలో పాలు పోయడం ఆనవాయితీగా వస్తోంది. అయితే నగర జీవనం నేపథ్యంలో నాగరాజుకు పాలు పోసేందుకు సమీపంలో పుట్టలు అందుబాటులో లేని పరిస్థితి ఉంది. దీన్ని దృష్టిలో పెట్టుకొని జీవీఎంసీ 90వ వార్డు ఏపీఎస్ఈబీ కాలనీలోని శ్రీ షిర్డీ సాయి ధ్యానమందిరం ప్రాంగణంలో నాగుల చవితి పూజలకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఆలయానికి ఆనుకుని ప్రదేశాన్ని 'నాగుల చవితి పార్కు'గా అభివృద్ధి చేశారు. నాగుల చవితి రోజు పూజలు చేసి నాగదేవతకు పాలు పోసేందుకు ఇక్కడ సహజసిద్ధంగా పుట్టలు వెలిశాయి. పార్కులో తులసి, ఉసిరి చెట్లతో పాటు ఎంతో ప్రత్యేకతతో కూడిన దత్తాత్రేయ వృక్షం ఉండటంతో ఆలయానికి వచ్చిన వారంతా ఇక్కడ కొద్దిసేపు సేద తీరేందుకు ఎంతో ఆసక్తి కనబరుస్తారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు విళ్లా సత్యనారాయణ రావు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని సభ్యుల సహకారంతో నాగుల చవితి పార్కును ఆధ్యాత్మికత ఉట్టిపడేలా తీర్చిదిద్దారు. ఏపీఎస్ఈబీ, సీతారామరాజు నగర్, సుసర్లకాలనీ, బుచ్చిరాజుపాలెం, లక్ష్మీనగర్ ఎఫ్–బ్లాక్ వాసులు చవితి రోజున నాగదేవతకు పూజలు చేసేందుకు ఇక్కడికి తరలిరానున్న నేపథ్యంలో ఏర్పాట్లు పూర్తి చేశారు.

చిన్న పిల్లలకు స్పెషాలిటీ ఆస్పత్రి ఏర్పాటు చేయాలి



మాట్లాడుతున్న ప్రజారోగ్య వేదిక ప్రతినిధి

దాబాగార్డెన్స్: రాష్ట్ర విభజన నేపథ్యంలో మన రాష్ట్రంలో చిన్న పిల్లలకు ప్రత్యేక స్పెషాలిటీ ఆస్పత్రి ఏర్పాటు చేయాలని, అది నీలోఫర్ స్థాయి స్పెషాలిటీ ఆస్పత్రిగా ఉండాలని ప్రజారోగ్య వేదిక డిమాండ్ చేసింది. ప్రభుత్వం వెంటనే నిధులు కేటాయించి విమ్స్‌ను పూర్తి స్థాయిలో అభివృద్ధి చేయాలని, కేజీహెచ్, వీజీహెచ్‌లో విభాగాల సంఖ్య పెంచి, మౌలిక వసతులు కల్పించి, సిబ్బంది సంఖ్య పెంచాలని డిమాండ్ చేసింది. అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో కూడా మౌలిక వసతులు, సిబ్బంది సంఖ్య పెంచాలని సమావేశంలో ప్రభుత్వాన్ని కోరారు. అల్లూరి విజ్ఞాన కేంద్రంలో ఆదివారం ప్రజారోగ్య వేదిక విస్తృత సమావేశం నిర్వహించింది. ముందుగా ప్రజారోగ్య వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి. కామేశ్వరరావు గత నాలుగేళ్లలో సంస్థ చేపట్టిన కార్యక్రమాలు వివరించారు. ఎకనామిక్స్ ప్రొఫెసర్ పద్మ మాట్లాడుతూ విద్య, వైద్యం రెండూ ప్రభుత్వ రంగంలోనే కొనసాగాలన్నారు. డాక్టర్ ఎస్ఎస్ రాజు మాట్లాడుతూ ప్రజారోగ్యం ప్రభుత్వాల బాధ్యత అనే నినాదం ప్రకారం ప్రజారోగ్య వేదిక కార్యక్రమాలు నిర్వహించడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. డాక్టర్ వైఎల్ నరసింగరావు మాట్లాడుతూ ప్రజారోగ్య వేదికను ప్రతి రంగంలోకి తీసుకెళ్లాలని, తద్వారా ప్రజలకు చేరువ కావాలని సూచించారు. డాక్టర్ పి. రామారావు మాట్లాడుతూ ప్రజారోగ్యం బాధ్యతను ప్రభుత్వం తప్పించుకుని ప్రైవేట్ రంగానికి అప్పగించడం బాధాకరమని, ఇది భవిష్యత్‌కు ప్రమాదకరమన్నారు.

కార్యక్రమంలో ఆవాజ్ సంస్థ ప్రతినిధి ఆశ్రాఫ్, జన విజ్ఞాన వేదిక రాష్ట్ర నాయకుడు మురళీధర్, కేవీపీ చంద్రమౌళి, డాక్టర్ శ్రీనివాస్, సంజయ్‌కుమార్, సురేష్, కళాధర్‌తో పాటు మిడ్డే మీల్స్, ఆశ, అంగన్‌వాడీ వర్కర్ల యూనియన్ నాయకులు పి. మణి, మహేష్, శ్రీనివాస్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

అల్లర్లు సృష్టిస్తే కఠిన చర్యలు

సీతమ్మధార : ద్వారకా పోలీస్ స్టేషన్ పరిధిలో అల్లర్లు సృష్టించినా, రౌడీయిజం చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని ద్వారకా ఎస్ఐ శ్రీను హెచ్చరించారు. ఈ మేరకు ద్వారకా పోలీస్ స్టేషన్ పరిధిలో పలు కేసులతో సంబంధం ఉన్న రౌడీషీటర్లకు ఆదివారం ఆయన కౌన్సిలింగ్ నిర్వహించారు. ముందుగా వారి వేలిముద్రలు సేకరించారు.

అనంతరం ఎస్ఐ శ్రీను మాట్లాడుతూ నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి ఆదేశాల మేరకు రౌడీషీటర్లపై చర్యలు తీసుకుంటామన్నారు. మద్యం సేవించి షాపుల వద్ద అల్లరి చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తగాదాలు, కొట్లాటల్లో తలదూర్చకుండా కుటుంబాలతో హాయిగా జీవించాలని సూచించారు. నిత్యం పోలీసుల నిఘా ఉంటుందన్నారు.

- సమాజంలో అల్లర్లు సృష్టించకుండా కుటుంబాలతో ప్రశాంతంగా జీవించాలని ఫోర్త్‌టౌన్ సీఐ ఎస్.విజయకుమార్ సూచించారు. ఈ మేరకు స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లకు ఆదివారం ఆయన కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారి రోజువారీ విధానాలపై ఆరా తీశారు. అల్లర్లు సృష్టిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.